వట్టెం పంపుహౌజ్‌ను పునరుద్ధరించాలి

- ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే కూచకుళ్ల ఆదేశం
- విద్యుత్‌లైన్ ఏర్పాటుకు రూ. 62 కోట్లు మంజూరు
- కొలిక్కి వచ్చిన డీవాటరింగ్ ప్రక్రియ
- తేలిన నాలుగు బాహుబలి పంపులు



వట్టెం పంపుహౌజ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నీట మునిగిన వట్టెం పంపుహౌజ్ పునరుద్దరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ఆదేశించారు. పంపుహౌజ్‌లో మోటార్ల రన్నింగ్‌కు సంబంధించి అవసరమైన విద్యుత్ లైన్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.62కోట్లు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ఈ నెల 3న వరద నీటిలో మునిగిన వట్టెం పంపుహౌజ్‌లో నీటిని తోడివేసే ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఆయన పంపుహౌజ్‌ను పరిశీలించారు. ఒక్కొక్కటి 145 మెగా వాట్ల సా మర్థ్యం గల నాలుగు పంపులు నీట మునిగాయి. పంపుహౌజ్‌లో 34 లక్షల 40 వేల క్యూబిక్ మీటర్ల నీరు చేరడంతో దాదాపు 6వేల హెచ్‌పీ సామర్థ్యం గల 50 మోటార్లను వినియోగించి పంపుహౌజ్‌లో నీటిని తోడే ప్రక్రియ బుధవారం రాత్రి కొలిక్కి వచ్చింది. ఈ సందర్భంగా పునరుద్దరణ పనులు కోసం పట్టే సమయాన్ని ఈఈ పార్థసారథిని అడిగి తెలుసుకున్నారు. పంపుహౌజ్‌లో నీటి తోడివేత ప్రక్రియను అనుకున్న సమయాని కంటే ముందుగానే పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. రాబోయే 15రోజుల్లో పంపులు డ్రై, వెట్ రన్‌లను పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంపుహౌజ్ నీట మునగ డం వల్ల మోటార్లు, ఇతర పరికరాలలో పెద్దగా నష్టం వాటిల్ల లేదని పేర్కొన్న కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పంపుహౌజ్ మునకను ప్రతిపక్షాలు రాజకీయం చేసేందుకు ప్రయత్నించాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో వట్టెం రిజర్వాయర్ ద్వారా ప్రతీ గుంటకు సాగునీరందిస్తామని అన్నారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు సంతోష్‌రెడ్డి, మోహన్, నాగనూల్ కృష్ణారెడ్డి, కుమ్మెర మోహన్‌రెడ్డి, పార్వతి ఉన్నారు.

దుందుభీకి వరద

-సిర్సవాడ, పాపగల్ గ్రామాల వద్ద నిలిచిన రాకపోకలు



మేడిపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

తాడూరు, సెప్టెంబరు 26 : ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా దుందుభీ నదికి వరద వస్తోంది. గురువారం మండలంలోని దుందుభీ నది ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో పాపగల్, సిర్సవాడ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు చుట్టూ తిరుగుతూ ఇటు జడ్చర్ల, అటు మేడిపూర్ రహదారులపై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దుందుభీ నది అవతలి ఒడ్డున వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు నది దాటే పరిస్థితి లేని కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.




నాగర్‌కర్నూల్ : సోమశిల వద్ద నదీతీరంలో ఏర్పాటు చేసిన కాటేజీలు

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం

- పర్యాటక కేంద్రాలకు నిలయం ఉమ్మడి పాలమూరు
- నల్లమలలో కనువిందు చేసే ప్రకృతి అందాలు
- సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణమ్మ పరవళ్లు
- మహబూబ్‌నగర్‌లో సేద తీర్చే పిల్లల మర్రి మహావృక్షం
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

మైమరపించే ప్రకృతి అందాలు.. ఆధ్యాత్మిక పరిమళాలు.. ఒకవైపు ఎత్తయిన కొండలు, మహా వృక్షాలతో కనువిందు చేసే నల్లమల, మరో వైపు గలగలా పరవళ్లు తొక్కుతూ ప్రవహించే కృష్ణానది.. వాటితో పాటు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పురాతన భారీ వృక్షం పిల్లల మర్రి... పట్టణ సమీపంలోని అర్బన్ ఎకో పార్కు.. ఇలాంటి మరెన్నో పర్యాటక కేంద్రాలకు ఉమ్మడి పాలమూరు నిలయంగా విరాజిల్లుతోంది. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న చిత్ర కథనం...

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్స్/మహబూబ్‌నగర్/వనపర్తి



వనపర్తి : శ్రీరంగాపూర్‌లో రంగనాథస్వామి ఆలయం



కొల్లాపూర్ : సోమశిల వద్ద బుద్ధుడి విగ్రహం



పాలమూరు : కేసీఆర్ ఎకోపార్కు



వనపర్తి : పామాపురంలోని ఊక చెట్టు వాగుపై చెక్‌డ్యాం వద్ద కృష్ణమ్మ పరవళ్లు



వనపర్తి : అమరచింత మండలంలో ఉన్న చంద్రఘడ్ కోట






వనపర్తి : గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయం



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద సందర్శకులు

పాలమూరు : మన్యంకొండ వేంకటేశ్వరస్వామి దేవాలయం



నాగర్‌కర్నూల్ : సోమశిలలో కొండల మధ్య కృష్ణమ్మ సోయగాలు





పాలమూరు : పిల్లలమర్రి వద్ద చిన్నారులను ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్



పిల్లలమర్రి వద్ద వాకింగ్‌ట్రాక్

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

జడ్చర్ల, సెప్టెంబరు 26 : జాతీయరహదారిపై జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ గేటు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మొండి బాలమ్మ(32) మృతి చెందింది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ సంజీవ్‌నగర్(వానగుట్ట)లో నివాసం ఉంటున్న బాలమ్మ, ప్రతీరోజు కాగితాలు సేకరించడానికి వెళ్తుంది. కాగితాలు ఏరుకుంటూ.. రోడ్డు దాటుతుండగా పోలేపల్లి సెజ్ గేటు వద్ద బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలమ్మ మృతదేహం ఛిద్రమైంది. తోటికోడలు శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలియజేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటయ్య(ఫైల్)

గండీడ్ , సెప్టెంబరు 26: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గండీడ్ గ్రామానికి చెందిన వెంకటయ్య(55) సొంత ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. బేస్‌మెంట్‌లో మట్టి నింపుతున్నాడు. టిప్పర్‌లోని మట్టి పైకి ఎత్తే సమయంలో విద్యుత్ తీగ తెగి వెంకటయ్యపై పడింది. అతను అక్కడే కిందపడి పోయాడు. గమనించిన గ్రామస్థులు కాపాడేందుకు ప్రయత్నం చేశారు. వెంటనే ప్రైవేటు వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య చెన్నమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

భూములు ఇచ్చి పరిహారం అడుగొద్దా

- పరిహారం చెల్లించాకే పనులు చేయాలి : డీకే అరుణ



జడ్చర్లలో సిగ్నల్‌గడ్డ వద్ద జాతీయ రహదారి నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్), సెప్టెంబర్ 26: ఉద్దండపూర్ రిజర్వాయర్‌కు భూములు ఇచ్చి రైతులు పరిహారం అడుగొద్దా ఇదెక్కడి న్యాయం అని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. గురువారం ఉదండపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన కొంతమంది రైతులు ఎంపీని తన స్వగృహంలో కలిసి వారికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. డబ్బులు వచ్చేవి వస్తాయి. కానీ జరిగే పనులు జరుగనివ్వండి ఎలాంటి ఆటంకాలు కలుగజేయకండని ప్రజాప్రతి నిధులు వార్నింగ్ ఇస్తున్నారని, కనీసం నిన్న వచ్చిన మంత్రులను కలిసి తమ గోడును వినిపిద్దామన్నా.. కలువనివ్వలేదని వాపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పరిహారం కోసం మంత్రులను కలుస్తామన్నా.. కలవనీయక పోవడం, పోలీసులతో భయ పెట్టడం వంటివి ఏమిటని ప్రశ్నించారు. పరిహారం చెల్లించాకే ప్రాజెక్ట్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఎనిమిదేళ్ల కిందట భూసేకరణ జరిగితే ఇప్పటివరకు పరిహారం ఇవ్వకుంటే ఈ ప్రభుత్వాలను ఏమనా లన్నారు. మీకు పరిహారం ఇప్పించేంత వరకు వదిలేసే ప్రసక్తే లేదని రైతులకు హామీ ఇచ్చారు.

అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తా

జడ్చర్ల: జడ్చర్ల మునిసిపాలిటీ మీదుగా ఉన్న 167వ జాతీయ రహదారి నిర్మాణ పనుల జాప్యంపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తామని ఎంపీ డీకే అరుణ వెల్లడించారు. జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో రైల్వేబ్రిడ్జి, జాతీయ రహదారి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పనులలో నాణ్యత లోపాలు ఉన్నట్లుగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. రైల్వే, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, కాంట్రాక్టర్‌లతో మాట్లాడి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తానన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు తనను కలిశారని, మంత్రులను కలిసేందుకు అవకాశం ఇవ్వకుండా పోలీసులు అడ్డుకున్నారంటూ తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. పాలమూరు పార్ల మెంట్ నియోజకవర్గానికి నీళ్లు అందించే లక్ష్యం నీరుగారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.25 లక్షల పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే అందుకు చొరవ చూపాలన్నారు.

నెట్టింట్లో నయవంచకులు

- మాటలతో మభ్యపెట్టి ఖాతాలు ఖాళీ
- రెండేళ్లలో రూ.2.63 కోట్లకు పైగా నగదు స్వాహా
- ఏడు మాసాల్లో 61 కేసులు, రూ. 12,29,342 మాయం
- రూ. 7,51,744 రికవరీ చేసిన పోలీసులు
- అవగాహన కల్పిస్తున్నా మోసపోతున్న ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలి : శ్రీనివాసరావు, ఎస్పీ



గద్వాల క్రైం, సెప్టెంబరు 26 : హలో సార్.. మీ మొబైల్ నెంబర్‌కు గిఫ్టు తగిలిందని, మీ అడ్రస్ చెబితే పంపిస్తామని చెప్పారు. ధ్రువీకరించుకునేందుకు మీ ఫోన్‌కి వచ్చే ఓటీపీని మాకు తెలియజేయాలంటారు. మీ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ చేయాలని అలా చేయకుంటే మీ ఖాతా రద్దు చేయబడుతుందని ఇలా సైబర్ నేరగాళ్లు మోసం చేస్తు న్నారు. ఈ నేరగాళ్లకు మోసపోతున్నది నిరక్ష రాస్యులే కాదు.. ఉన్నతంగా చదువుకున్న ఉద్యో గులు కూడా ఉన్నారు. మోసపోయిన తరువాత లబోదిబో మంటూ కొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మరి కొందరు లోలోపల కుమిలిపోతున్నారు.

జిల్లాలో జరిగిన సైబర్ కేసుల్లో మచ్చుకు కొన్ని

- 2024, జూలై 25న గద్వాల పట్టణానికి చెందిన ఓ బ్యాంకు అధికారికి ఇన్‌స్ట్రాగ్రాం ద్వారా ఆన్‌లైన్‌ట్రేడింగ్ మార్కెటింగ్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికారు. రూ. 1.50 లక్షలు స్వాహా చేశారు. 2024, జూన్ 28, గద్వాల పట్టణానికి చెందిన ఓ విద్యార్థికి వాట్సాప్‌లో వీడియో కాల్ చేసి రూ. 1.80 లక్షలు కాజేశారు. జూలై 27న గద్వాల పట్టణంలోని ఓ కౌన్సిలర్ భర్తకు ఓ మహిళా బెదిరింపు కాల్ చేస్తే ఆయన వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో డబ్బులు పోలేదు.


సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఒకవైపు.. పోలీస్ అధికారులంటూ భయపెడుతూ.. కేవలం తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశచూపి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారు. మొదట కొద్ది డబ్బు పెడితే కొద్ది రోజులకు ఎక్కువగా వస్తుందని, నమ్మబలుకుతూ ముఖ్యంగా సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నారు. అంతేగాకుండా వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో కొన్ని ప్రత్యేక యాప్‌లద్వారా ఇంటిదగ్గర ఉంటే డబ్బులు సంపాదించవచ్చని కొన్ని ఫేక్ యాప్‌లను సృష్టిస్తూ సైబర్ నేరగాళ్ల తమ కార్యకలాపాల ద్వారా అమాయకుల నుంచి డబ్బులను దోచుకుంటున్నారు. ప్రస్తుతం తాజాగా వారి ట్రెండ్‌ను మార్చుకుంటున్నారు. ముఖ్యంగా తాము పోలీస్ అధికారులమని నమ్మిస్తూ వాట్సాప్‌లలో డీపీలను పోలీస్ అధికారులవి ఉంచుతూ మీ కుమారుడు, కుమార్తె కేసుల్లో ఉన్నారని, వారిని కేసుల నుంచి తప్పించాలంటే డబ్బులు ఇవ్వాలని భయభ్రాంతులకు గురిచేస్తు వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బులను లాగేసుకుంటున్నారు. సైబర్ నేరగాళ్లు జోగుళాంబ గద్వాల జిల్లాలో గడిచిన రెండేళ్లలో రూ. 2.63 కోట్ల కాజేశారు. తాజాగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 61 సైబర్ కేసులు నమోదు కాగా ఇందులో రూ.12,29,342 నగదు మాయం అయినట్లు తెలిసింది. గడిచిన వాటిలో కొన్ని, ప్రస్తుత కేసులో కొన్నింటిని రూ. 7,51,744 నగదును రికవరీ చేసినట్లు జిల్లా పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బాలికలు, మహిళలు వ్యక్తిగత ఫొటోలు, సమాచారం అపరిచితులకు పంపించొద్దు. అలా చేస్తే మీ వ్యక్తిగత సమాచారం సైబర్ నేరాలకు ఉపయోగించే అవకాశం ఉంది. కొత్త నంబర్స్ నుంచి కాల్స్ వస్తే జాగ్రత్త పడాలి. ముఖ్యంగా బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే 1930కు గాని, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌ను గ్రామాల్లో, పట్టణాలలో పోలీసులు సైబర్ నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు.

- శ్రీనివాసరావు, ఎస్పీ గద్వాల





పాలమూరుకు యువటూరిజం క్లబ్ అవార్డ్

▸▸ నేడు సీఎం చేతుల మీదుగా అందుకోనున్న కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్‌నగర్, సెప్టెంబరు 26 : పాలమూరుకు యువ టూరిజం క్లబ్ అవార్డ్ దక్కింది. రాష్ట్రంలో మూడు జిల్లాలకు ఈ అవార్డ్ రాగా అందులో మహబూబ్‌నగర్ ముందువరుసలో ఉండటం గమనార్హం. శుక్రవారం పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగ కలెక్టర్ విజయేందిర బోయి ఈ అవార్డును అందుకోనున్నారు. సీఎం రేవంత్ సొంత జిల్లా, పర్యాటక శాఖ మంత్రిగా జూపల్లి కృష్ణారావు ఉండటంతో అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పెద్ద మొత్తంలో క్లబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా యువ టూరిజం అవార్డ్ పాలమూరు వరించిందన్న విషయం స్పష్టమవుతోంది. యువ టూరిజం క్లబ్ ప్రోగ్రామ్‌లో భాగంగా రాష్ట్రంలోనే అత్యధికంగా పాలమూరులో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేశారు. యువ టూరిజం క్లబ్ అనేది విద్యార్థులలో చారిత్రాత్మక కట్టడాలు, కెరియర్ గైడెన్స్, అనుబంధ రంగాల్లో వృత్తి నైపుణ్యాలు, పర్యాటక సాంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో పెద్ద ఎత్తున క్లబ్‌లను ఏర్పాటు చేశారు. బుధవారం నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలలు, పాలమూరు యూని వర్సిటీ, కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాలలో 1317 క్లబ్‌లను ఏర్పాటు చేసి పాలమూరు రాష్ట్రంలోనే ప్రథమ స్థానం లో నిలవడం గమనార్హం. విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే టూరిజంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడనుంది. జిల్లాకు ఇలాంటి ఉత్తమ అవార్డ్ లభించడం పట్ల అధికార యంత్రాంగం హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు అభినందలు తెలుపుతున్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి : ఎమ్మెల్యే


అడ్డాకుల, సెప్టెంబరు 26 : ఆధునిక కాలంలో క్రీడలకు ప్రాధాన్యత పెరుగుతోందని, విద్యార్థులు చదువులతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పొన్నకల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడలలో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులు గుర్తించి, వారిలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ పేరిట రూ.350 కోట్ల నిధులను సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించారని ఎమ్మెల్యే తెలిపారు. అండర్ 14, 17 క్రీడలను మండలంలోని రాచాలలో నవంబర్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అండర్ 14-కబడ్డీలో బాలుర విభాగంలో తిమ్మాయిపల్లితండాకు చెందిన నిఖిల్, పి.విజయ్, పి.శివ, శివకుమార్, కె.మహేశ్, మున్న, రమేశ్‌లకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

16 లీటర్ల సారా, 100 కిలోల బెల్లం పట్టివేత

వంగూరు, సెప్టెంబరు 26: మండలంలోని తండాల్లో గురువారం కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. జరుపుల తండా, సర్వారెడ్డిపల్లి తండా, కొండారెడ్డిపల్లిలో దాడులు నిర్వహించి 16 లీటర్ల సారా, 100 కిలోల బెల్లం, 10 కిలోల బెల్లం పటిక పట్టుకున్నారు. 400 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. సారా, బెల్లం స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



కొత్తకోటలో చైన్ స్నాచింగ్

కొత్తకోట, సెప్టెంబరు 26 : జీవనోపాధి కోసం కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని భవాని దేవాలయం ఎదురుగా ఆ కాలనీకి చెందిన వితంతురాలు నాగమ్మ కొబ్బరి బొండాలు విక్రయించుకుంటుంది. ఓ వ్యక్తి వచ్చి లీటరు కొబ్బరి బొండా నీళ్ల ఇవ్వాలని కోరాడు. టెంకాయ కొట్టి వాటర్ బాటిల్‌లో పోసి ఇస్తుండగా.. గొలుసు తెంపుకొని కొంత దూరంలో పరుగెత్తాడు. అప్పటికే కొంత దూరంలో నిలిపుకొని ఉన్న బైక్ ఎక్కి పరారయ్యాడు. బాధితురాలు కొంత దూరం వెంట పరిగెత్తినా లాభం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

కిరాణ దుకాణంలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 26 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపూర్ రోడ్డు లోని పాపిశెట్టి నరేందర్ కిరాణదుకాణంలో గుర్తు తెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. కిరాణదుకాణంలో రూ.20 వేల నగదును అపహరించుకెళ్లారు. సామాను దొంగిలించేందుకు ఒక సంచిలో సామాను వేసుకుని తీసుకెళ్లడానికి వీలుకాక అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోయారు. షాపు యజమాని డబ్బులను పాత సంచిలో వేసి ఉంచాడు. దుండగులు ఆ డబ్బులను చూడకపోవడంతో మిగిలిపోయాయి. నల్లవెల్లిరోడ్డులోని దుకాణం వద్ద సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఈ చోరీకి పాల్పడ్డాడు. ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ఉన్న సాయిగణేష్ కిరాణ షాపులో తాళాలు పగలగొట్టి దొంగతనానికి ప్రయత్నించారు. అక్కడ వీలుపడకపోవడంతో వెళ్లిపోయారు. ఈ సంఘటనపై నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో ఎస్‌ఐ రమాదేవి తెలియజేశారు.

బాలిక అదృశ్యం : కేసు నమోదు

రాజాపూర్, సెప్టెంబరు 26: మండలంలోని ఓ గ్రామంలో బాలిక బుధవారం అదృశ్యమైనట్లు ఎస్‌ఐ కె.రవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చుట్టపుచూపుగా వచ్చింది. బాలిక రెండు రోజుల నుంచి కనిపించడంలేదు. పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్దకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం బాలిక భావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ పేర్కొన్నారు.

వృద్ధుల హక్కులను కాపాడుదాం



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 26 : వృద్ధుల హక్కులను కాపాడుతూ వారిని గౌరవించుకుందామని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి అన్నారు. అక్టోబరు 1న ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధులను సమస్యల నుంచి దూరంగా ఉంచాలని, వారి పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలనే తదితర అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో 1 టౌన్ సీఐ అప్పయ్య, మెడికల్ ఆఫీసర్ ఎండీ అస్గరలీ, సీడీపీఓ రాధిక, డీఎంసీ శివకుమార్, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు జి. నాగభూషణం, అహ్మద్, నాగేశ్వరి, అలవేలు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణికి ఇవ్వొద్దు

- టీజీ పీఈ జేఏసీ నాయకుల పిలుపు



నిరసన తెలుపుతున్న టీజీ ఎస్‌పీడీసీఎల్ జేఏసీ నాయకులు, ఉద్యోగులు

పాలమూరు, సెప్టెంబరు 26 : రామగుండంలో విద్యుత్ ఉత్పత్తి కోసం సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకునేది లేదని టీజీ పీఈజేఏసీ నాయకులు అన్నారు. జెన్‌కో ఆధ్వర్యంలోనే రామగుండం థర్మల్ ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఎదుట ఉద్యోగులు, జేఏసీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సింగరేణి భాగస్వామ్యంతో విద్యుత్ ఉత్పత్తిని చేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు నిరసన చేపట్టారు. నూతన ప్రాజెక్టులో సింగరేణి భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ పవర్ ఇంజనీర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సాయిబాబా, పి.రత్నాకర్ రావు, ఎస్.ఈ పి.వెంకట్‌రావు, స్వామి, పాండునాయక్, బాబ్య, ఏడీలు ఎం.నవీన్‌కుమార్, ఖుర్షిద్ జహాన్, ఏఈ శ్వేత, చంద్రకళ, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

గద్వాల అర్బన్, సెప్టెంబరు 26: గద్వాల మండలం వీరాపు రం ఎస్ఆర్ విద్యానికేతన్ ఇంట ర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల అండర్-17 బాలురు, బాలికల జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు గద్వాల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి.జితేం దర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శు లందరూ విద్యార్థులను పోటీలకు హాజరయ్యేలా చూడా లన్నారు. ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన విద్యా ర్థుల జాబితా, ఎల్జిబిలిటీ ఫాం, బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంతకాలతో హాజరు కావాలని తెలియజేశారు. ఇతర వివరాలకు కన్వీనర్ బషీర్ అహ్మద్ (98854 79896), కో కన్వీనర్లు నగేష్‌బాబు (99481 97273), ఆనంద్‌కుమార్ (83282 61718)లను సంప్రదించాలన్నారు.

చెంచులకు ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం


చెంచుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

మన్న నూర్, సెప్టెం బరు 26: నల్ల మల ప్రాంత ంలోని పెంట ల్లో నివసించే ఆధార్ లే ని చెంచుల కోసం మన్న నూరు లోని గిరిజన భవన్, రైతు వేదిక కార్యాల యాల వద్ద జన్మన్ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆర్డీఓ మాధవి గురు వారం ప్రారంభించారు. ఆధార్‌తో పాటుగా కులం, ఆదాయం, నివాసం, జనన ధ్రువీకరణ పత్రాల కోసం చెంచు లు ఉచితంగా దరఖాస్తు చేసుకుంటే తక్షణమే జారీ చేసే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రోహిత్ గోపిడి, ఐటీడీఏ, తహసీల్దార్ కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు కొనసాగాలి



మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రశాంత

పాలమూ రు యూనివ ర్సిటీ, సెప్టెంబర్ 26: శా స్త్రీ య పద్ధతిలో పరిశో ధనలు జర గాలని ఉస్మా ని యా యూని వ ర్సిటీ ప్రొఫె సర్ డాక్టర్ ప్రశా ంతా ఆత్మ తెలిపారు. గురువారం పీ యూ లైబ్ర రీ ఆడిటో రియంలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డేటా సేకరణ పద్ధతులు, అవి ప్రాథమిక డేటా సేకరణ, ద్వితీయ డేటాను క్రమపద్ధతిలో ఎలా పొందుపరచాలో వివరించారు. అవసరమగు టూల్స్ ఎన్నిక, శాంపిల్ పరిమాణం, ప్రశ్నోత్తరాల సేకరణ తదితర వాటి గురించి వివరించారు. మోడల్‌ను రీసెర్చ్ మెథడాలజీలో ఎలా అన్వయించుకోవాలనే అంశాలను వివరించారు. అంతకు ముందు తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు సబిహా షరీఫ్ మాట్లాడారు. సేకరించిన డేటాను ఏవిధంగా రిసెర్చ్ రిపోర్ట్‌గా రాయాలి, కోడింగ్ డికోడింగ్, ట్యాక్టింగ్, ఎడిటింగ్, డిలీటింగ్‌లను సందర్భాను సారంగా వాడి ఎలా తయారు చేయాలో వివరించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్ కుమార్, లైబ్రరీ కో- ఆర్డినేటర్ డాక్టర్ అనురాధ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ జిమ్మికాటన్, కో-కన్వీనర్ డాక్టర్ రామచేందర్, అధ్యాపకులు డాక్టర్ శివలింగం, అధ్యాపకులు రాజు,పీయూ అనుబంధ కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో పర్యటించిన ఢిల్లీ బృందం


కొత్తూరులో స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న వైద్యాధికారుల బృందం

భూత్పూర్, సెప్టెంబరు 26: మండలంలోని కొత్తూరు గ్రామాన్ని ఢిల్లీ వైద్యాధికారుల బృందం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో ఈ గ్రామ శివారులోని కర్వెన రిజర్వాయర్ ప్రాంతంలో మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా అప్పట్లో కొత్తూరులో మలేరియా నివారణ అధికారులు పర్యటించి గ్రామంలో దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజల ఆరోగ్యం పరిస్థితులు ఎలా ఉన్నాయి. అనే విషయాలను తెలుసుకోవడానికి ఢిల్లీ అధికారుల బృందం వైద్యాధికారుల బృందం డాక్టర్ పట్నాయక్, డాక్టర్ గోవిందర్, డాక్టర్ శ్రీకార్, రాష్ట్ర మలేరియా నివారణ అధికారి విజయ్‌కుమార్, తదితరులు కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశమయ్యారు. అనంతరం ప్రస్తుతం ప్రబలుతున్న సాధారణ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా దోమల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలకు వైద్యాధికారుల బృందం సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి శశికాంత్, సీహెచ్‌వో ఆయూబ్‌ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యాదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని రాస్తారోకో


రోడ్డు పై బైఠాయించిన ముందలి తండావాసులు

మహమ్మదాబాద్ సెప్టెంబరు 26: మూడు రోజులుగా కరెంట్ రావడంలేదని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని గురువారం జాతీయ రహదారి - 167పై (మహబూబ్‌నగర్ -తాండూర్) సుమారు గంట పాటు ధర్నా చేపట్టారు. దీంతో రోడ్డుపై భారీ వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ముందలితండా నాయకులు మాట్లాడారు. మూడు రోజులుగా తండాలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అంధకారంలో ఉన్నామని ఏఈ, డీఈ దృష్టికి తీసుకెళ్లినా.. మా గోడు పట్టించుకోవడంలేదన్నారు. బుధవారం రాత్రి 10 గంటలకు మహమ్మదాబాద్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తే డీఈ స్పందించి గురువారం ఉదయం సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయినా సమస్య పరిష్కరించలేదని ఆరోపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు , విద్యుత్ శాఖ అధికారుల సమస్య పరిష్కరిస్తాని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఎడతెరిపి లేని వర్షాలు.. చేతికి రాని తెల్లబంగారం


ఇంద్రకల్‌లో చెట్టుకే పచ్చిముద్దలా మారిన తెల్లబంగారం

తాడూరు, సెప్టెంబరు 26: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఇటీవల వారం రోజులుగా కురుస్తున్న నిరంతర వర్షాలతో పొలంలోనే చెట్లకు తెల్లబంగారం తడిసిముద్దవుతుంది. ఈ పరిస్థితిని చూసి పత్తిరైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.వేలల్లో పంట పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయాన ఇలాంటి వర్షాల కారణంగా పత్తి పూర్తిగా దెబ్బతినిపోతుండడంతో పత్తిరైతులు ఆందోళన చెందుతున్నారు. కురుస్తున్న వర్షాల కారణంగా చెట్టుకే పత్తి పూర్తిగా రంగు మారడంతోపాటు పత్తి విత్తనాలు ఉబ్బి మొలక వచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. భూమిపై పడిన పత్తి పూర్తిగా మట్టిలో కలిసిపోతుండడంతోపాటు చాలా పత్తికాయలు మురిగిపోతున్నాయంటూ ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత వర్షాల కారణంగా పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

క్రీడలతో మానసికోల్లాసం

- అట్టహాసంగా ప్రారంభమైన రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్
- అటవీశాఖ ఉద్యోగుల బాధ్యత చాలా గొప్పది
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


షాట్‌పుట్ విసురుతున్న డీఎఫ్‌వో సత్యనారాయణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 26: అటవీ శాఖ ఉద్యోగులు బాధ్యత చాలా గొప్పదని, ఉద్యోగం అని భావించకుండా మానవాళిని రక్షించే పని చేస్తారని మహబూ బ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీని వాస్‌రెడ్డి అన్నారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో గురు వారం స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత ంలో గ్లోబల్ వార్మింగ్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం.. కానీ ప్రతి సంవత్సరం మన కళ్ల ముందు జరుగుతుందన్నారు. మొన్న కురిసిన భారీ వర్షాలకు గ్లోబల్ వార్మింగ్ కారణమైందని చెప్పారు. కురిసిన వర్షాలకు ఇళ్లలోకి నీరు వచ్చిందని, వీటన్నింటికి చెట్లు లేకపోవడమే ప్రధాన కారణ మన్నారు. విపరీతంగా అటవీ సంపద కుంచించుకు పోవడం, అడవుల విస్తీర్ణత తగ్గడంతో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులను పరిరక్షిం చాల్సిన బాధ్యత మీపైన ఉందని, సమాజంలో ప్రతీఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని సంరక్షించుకోవాలన్నారు. అడవులను పరిరక్షించే క్రమంలో తమ ప్రాణా లను సైతం కోల్పోతారని, మీ రక్షణ కోసం ప్రభుత్వాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉదోగ్యుల సమస్యల పరిష్కారానికి తన సహకారం ఉంటుందన్నారు. క్రీడలతో ఆరోగ్యం, మానసి కోల్లాసం లభిస్తుందని, రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్ రాణించాలని ఆకాంక్షిం చారు. గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి, జెండా ఊపి పోటీలను ప్రారం భించి, క్రీడా వందనం స్వీకరించారు. వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, షటిల్ బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ క్రీడా అంశాల్లో పోటీలు జరిగాయి.


అథ్లెటిక్స్‌లో తలబడుతున్న క్రీడాకారులు

వాలీబాల్, కబడ్డీ విజేత అమ్రాబాద్

రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. వాలీబాల్ విభాగంలో జరిగిన మ్యాచ్‌లో అమ్రాబాద్ జట్టు 25-15, 25-18 స్కోర్ తేడాతో అచ్చంపేటపై గెలువగా, కబడ్డీ విభాగంలో అమ్రాబాద్ జట్టు అచ్చంపేటపై గెలిచింది. కబడ్డీ, వాలీబాల్‌లో విజేతగా అమ్రాబాద్ నిలువగా, అచ్చంపేట రన్నర్‌గా నిలిచింది. అథ్లెటిక్స్ విభాగంలో క్రీడాకారులు పతకాలు సాధించగా, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడా అంశాల్లో పోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఎఫ్‌వో సత్యనారాయణ, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో చంద్రయ్య, ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయం తనిఖీ చేసిన డీఐజీ


పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్‌చౌహాన్

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 26: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్పీ కార్యాలయం అన్ని విభాగాలను గురువారం జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా లెవల్‌లో పోలీసులు అందరూ బాధ్యతతో పని చేస్తున్నారని, అలాగే పని చేసి రాష్ట్రానికి మంచి పేరు తెచ్చేలా పని చేయాలన్నారు. ప్రతి వ్యక్తికి న్యాయం జరిగేలా పని చేయాలని పోలీసులకు దిశానిర్దేశాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్, టీపీ భరత్, నాగర్‌కర్నూల్ సబ్ డివిజన్‌కు సంబంధించిన సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శన

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మల్టీజోన్-2 డీఐజీ ఎల్ఎస్‌చౌహాన్ సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల గౌరవ వందనం చేయగా ఆయన స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయ న పోలీస్ స్టేషన్ లో రికార్డు లను పరి శీలించి పోలీస్ స్టేషన్ లో సిబ్బ ంది పనితీరుపై సమీక్షించారు. పోలీస్‌స్టే షన్ పరి ధిలో శాంతి భద్ర తల పరిస్థి తిపై ఆరా తీశా రు. కార్యక్ర మం లో నాగర్ క ర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ యాద వ్, కొల్లాపూర్ సీఐ మహేష్, ఎస్ఐలు సతీష్, రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ : కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సీఐ కార్యాలయాన్ని గురువారం డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సందర్శించారు. కొల్లాపూర్ సీఐ మహేష్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌కు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సీఐ కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు.

వైద్యం పేరుతో అమాయకులకు శఠగోపం


వైద్యం చేస్తున్న నకిలీ వైద్యుడు

అచ్చంపేట, సెప్టెంబరు 26: కల్వకుర్తి పట్టణంలోని వెంకటరమణ ఆసుపత్రికి చెందిన వైద్యులమని నాపేరు డాక్టర్ దేవేందర్‌గా పరిచయం చేసుకొని రూ.200లకే 32రకాల వైద్య పరీక్షలు చేసి ఇట్టే మీసమస్యను పసిగట్టి నయం చేస్తామని మాయమాటలు చెబుతూ ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని గ్రామాల్లో సంచరిస్తున్న నకిలీ వైద్యుల భాగోతం అచ్చంపేట నియోజకవర్గంలో పరిపాటిగా మారింది. ఎలాంటి అర్హతలు లేకున్నా.. అన్ని తానై వైద్య పరీక్షలు చేస్తూ.. రోగులకు మందులు ఇస్తూ రూ.లక్షల కాజేస్తున్న వైనం రెండు రోజులుగా ఉప్పునుంతల, అచ్చంపేట మండలాలో కొనసాగుతుంది. పేరుమోసిన ఆసుపత్రుల పేరును వాడుకుంటూ గ్రామాల్లో టాంటాం వేసి ప్రచారాన్ని నిర్వహించి చిన్నపాటి యంత్రంతో ప్రజల నుంచి రకరకాల టెస్టులు చేశానని నమ్మించి డబ్బులు కాజేస్తున్న సంఘటన ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల గ్రామంలో చోటుచెసుకుంది. ఈ విషయంపై డిప్యూటీ డీహెంఅండ్‌హెచ్‌ఓ తారసింగ్ దృష్టికి తీసుకెళ్లగా కొంత మంది వ్యక్తులు ఎలాంటి అర్హతలు లేకున్నా.. లేనిపోని టెస్టులు చేస్తూ.. ప్రజల నుంచి సొమ్ము కాజేస్తున్నారని, ఈ విషయం పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెరుకున్న పోలీసులు వైద్యుడిని పలువిధాలుగా ప్రశ్నించి వెకటరమణ సంబంధించిన వైద్యులతో మాట్లాడాలని అక్కడికి వచ్చిన పోలీసులు అతనిపై ఒత్తిడి చేయడంతో ఆయన నిరాకరిస్తూ దాటవేసిన ధోరణి ప్రదర్శించారు. ఇంకో సందర్భంలో నల్గొండ జిల్లా గుర్రంపోడుకు చెందిన వైద్యుడిని మరొకమారు చెప్పినట్లు తెలుస్తుంది. అతను ఇచ్చిన మందుల చిట్టీలో కల్వకుర్తి పట్టణం కేవ క్రైపో ఇండస్ట్రీస్ అని ఉడటం గమనార్హం. రెండు రోజులుగా అదే గ్రామంలో అమాయక ప్రజల నుంచి టెస్టుల పేరుతో రూ 200లు మందుల పేరుతో దాదాపు రూ.1000 వరకు ఒక్కో వ్యక్తినుంచి వసూలు చేస్తున్న సంఘటనపై బుధవారం పోలీసులు అతని వైద్యం ఆరా తీసినట్లు తెలుస్తుంది. కాని అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గురువారం అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో క్యాంపు నిర్వహణ కోసం గ్రామంలో టాంటాం వేయించగా గ్రామ పంచాయతీ అనుమతిచకపోగా గ్రామస్థులు 100కు డయల్ చేయడంతో నకిలీ వైద్యులను గ్రామం నుంచి తరిమేసినట్లు తెలుస్తుంది. ఏదిఏమైనా.. గ్రామాల్లో విచ్చలవిడిగా ఎలాంటి అర్హతలు లేకున్నా.. వైద్యం పేరుతో ప్రజలను మోసం చేస్తున్న వారిపై సంబంధిత శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైన ఉందని విద్యావేత్తలు, యువకులు కోరుతున్నారు.

గట్టులో భారీ రిజర్వాయర్ నడిగడ్డ ప్రయోజనాలకేనా?

- పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, సెప్టెంబరు 26 : గట్టులో భారీ రిజర్వాయర్ నిర్మాణం నడిగడ్డ ప్రయోజనాలకేనా...? అని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవాచారి, ఎ.తిమ్మప్ప, యం.వెంకట్రాములు, ఎం.డీ ఇక్బాల్ ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో బుధవారం సుడిగాలి పర్యటన చేసిన మంత్రులు నడిగడ్డ రిజర్వాయర్‌పై స్పష్టత ఇవ్వాలన్నారు. వాటిని ఐదేళ్లలో పూర్తి చేస్తామని చెబుతూ గట్టులో 15-20 టీఎంసీల భారీ రిజర్వాయర్‌ను ప్రతిపాదించింది.. ఆ రిజర్వాయర్ నింపడానికి జూరాల నుంచి స్వతంత్ర్య ఎత్తిపోతలను ప్రతిపాదించిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను రెండు భాగాలుగా చేపట్టుకునే డిమాండ్‌ను కాని, కల్వకుర్తి లిఫ్ట నీటితో చంద్రసాగర్ నుంచి అమ్రాబాద్ ఎత్తిపోతల చేపట్టాలని చేస్తున్న డిమాండ్‌ను కాని పట్టించుకోకుండా రాయచూరు ప్రాంత నీటికోసం ఒక భారీ రిజర్వాయర్ ప్రతిపాదించటం సమంజసమేనా.. అని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వ ప్రతిపాదనను చర్చలేకుండా ఆమోదిస్తారా.. అని ప్రశ్నించారు. నిజానికి కర్ణాటక రాష్ట్రం తుంగభద్ర డ్యాం నుంచి తెలంగాణకు రావాలిసన నీటిని రానీయకుండా కర్ణాటక చేస్తుండగా.. పక్కన ఆంధ్ర ప్రభుత్వం తరలించుకుపోతుందన్నారు. ఇప్పటి వరకు అప్పటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేయలేకపోతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనాల కోసం ఉన్నాయని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వం రాయచూరు ప్రాంతానికి లక్ష ఎకరాలకు సాగునీటి కోసం గట్టు రిజర్వాయర్ ప్రతిపాదన తెచ్చినప్పుడు ఆర్డీఎస్ కాలువ కింద తెలంగాణ నష్టపోతున్న లక్ష ఎకరాల నీటి పారుదల సంగతిపై తెలంగాణ జల వనరుల శాఖ మాట్లాడాలి కదా అన్నారు. ఆర్డీఎస్ కట్టను ఆధునీకరించి రాయచూరు ప్రాంతనీటి కోసం ఆ ప్రాంతంలోనే రిజర్వాయర్ కట్టుకోవచ్చన్నారు. పరిమితమైన సాగుభూములున్న నడిగడ్డ రైతాంగానికి అన్యాయం జరగకుండా భూమి కాపాడవచ్చన్నారు. ఇలాంటి తొందరపాటు పోకడలను మేం ఖండిస్తున్నామన్నారు. ప్రజల డిమాండ్ మేరకు వెల్టూరు-గొందిమల్ల బ్యారేజీ నిర్మించాలని, నెట్టెంపాడు చివరిదైన చిన్నోనిపల్లి నిర్మాణం ఆపాలన్నారు. ర్యాలంపాడులో పూర్తి నీరు నింపాలన్నారు. గట్టు భూముల కోసమే స్వతంత్ర్య లిఫ్టులతో గట్టు రిజర్వాయర్ కట్టాలని డిమాండ్ చేశారు.

వైద్యులు లేరు.. ప్రైవేటుకు వెళ్లండి

- కాన్పు కోసం వచ్చిన గర్భిణికి తెలియజేసిన ప్రభుత్వ వైద్యులు
- ఉన్నది ఇద్దరే వైద్యులు.. ఒకరు లీవ్‌లో.. మరొకరు 24 గంటల డ్యూటీ చేశారని వెల్లడి
- కడుపులో పిండం తిరడగంలేదని చెబుతున్నా.. పట్టించుకోని వైద్యులు


ఆశవర్కర్‌తో వచ్చిన గర్భిణి శ్రీదేవి

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 26: తనకు పిండం తిరగడంలేదని, కాన్పు చేయండని ఓ గర్భిణి గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి రాగా.. ఇక్కడ వీలు కాదని గర్భిణికి సిబ్బంది తెలియజేసిన సంఘటన చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

- జోగుళాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్ మండలం సద్దనోనిపల్లికి చెందిన శ్రీదేవికి మొదటి కాన్పు సిజేరియన్‌తో డెలవరీ అయ్యింది. రెండో కాన్పు వచ్చే నెల 16వ తేదీన ఉంది. ఇప్పటికే ఆమెకు తొమ్మిది నెలలు పూర్తయ్యాయి. కడుపులోని పిండం కదలికలు నిలిచిపోయాయి. దీంతో ఆమె వెంటనే జిల్లా కేంద్రం లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోగా.. వెంటనే ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీయాలని చెప్పారు. మొదటి కాన్పు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిందని, రెండో కాన్పు కూడా అక్కడే చేసుకుంటానని అక్కడి వైద్యులకు తెలియజేసి, ఆశావర్కర్ జయమ్మ సాయంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంది. ఆమెను పరిశీలించిన వైద్యులు.. నీకు స్కానింగ్ చేస్తే విషయం తెలుస్తుందని, అయితే స్కానింగ్ చేయించుకున్న కూడా నీకు ఇక్కడ అపరేషన్ చేయలేమన్నారు. నీవు పొట్టిగా, లావుగా ఉన్నావన్నారు. దీంతో పాటు ఇక్కడ ఉన్న ఇద్దరు గైనిక్ వైద్యుల్లో ఒకరికి ఆరోగ్యం బాగోలేక రాలేదని, ఉన్న ఒక్క డాక్టర్ 24 గంటలు విధులు నిర్వహించారని, గురువారం కూడా ఓపీలు చూశానని తెలియజేసింది. కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కాన్పు చేయించుకోవాలని, లేదంటే ఏదైన ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చేయించుకోవాలని తెలియజేశారు. దీంతో గర్భిణి గత్యంతరం లేక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లి విషయం తెలియజేసింది. ఎమ్మెల్యే వెంటనే జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వినోద్ కుమార్‌కు ఫోన్ చేసి సమాచారం తెలియజేశారు. శ్రీదేవికి ఇబ్బందులు లేకుండా చూడాలని, అవసరం అయితే కాన్పు చేయాలని సూచించారు. అయితే అప్పటి వరకు ఉన్న డాక్టర్ కూడా మధ్యాహ్నం 2 గంటలకు వెళ్లిపోయినట్లు సమాచారం. ఎమ్మెల్యే మాటకు సూపరింటెండెంట్ స్పంది ంచి గర్భిణిని ఆసుపత్రికి పిలిపించారు. స్కానింగ్ చేయించుకొని రావాలని, అందులో రిపోర్టును చూసి గైనిక్ డాక్టర్‌తో రిక్వెస్ట్ చేసి అవసరమైతే కాన్పు చేయించేలా చూస్తానని చెప్పాడు. దీంతో గర్భిణి స్కానిగ్ చేయించుకునేందుకు వెళ్లింది.

ఉన్నది ఇద్దరే వైద్యులు ..

ఆసుపత్రికి వచ్చిన గర్భిణి విషయంలో ఆంధ్రజ్యోతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా.. జిల్లా ఆసుపత్రి మొత్తానికి ఇద్దరు గైనిక్ డాక్టర్లు ఉండటంతో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఇందులో ఒకరు అనారోగ్యంతో ఆసుపత్రికి రాలేదని చెప్పారు. మరో డాక్టర్ 24 గంటల పాటు విధులు నిర్వహించిందని, దాంతో పాటు ఓపీలు కూడా చూడటంతో అలిసిపోయి వెళ్లాల్సి వచ్చిందన్నారు. వేరే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించామని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని చెప్పలేదని తెలియజేశారు.

మెకం దాడిలో కోడెదూడ మృతి


మృతిచెందిన కోడెదూడ

నారాయణపేట రూరల్, సెప్టెంబరు 26: మండల పరిధిలోని బోయిన్‌పల్లిలో మెకం దాడిలో కోడెదూడ మృతిచెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన మాలెకాడి పెద్ద రాములు తన పొలం వద్ద ఆవులను కోడెదూడను కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. అర్ధరాత్రి మెకం కోడెదూడపై దాడిచేసి చంపేసింది. ఉదయం రైతు పొలం వద్దకు వెళ్లి చూడగా కోడెదూడ మృతిచెంది ఉంది. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వివాహితపై అత్యాచారం: కేసు నమోదు

నవాబ్‌పేట,సెప్టెంబరు 26: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన బొంత శివ తరచూ అత్యాచారం చేయడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విక్రం తెలిపారు. కొంత కాలం కిందట తన సొంత పొలానికి వెళ్తుండగా వెంబడించి బలవంతంగా అత్యాచారం చేశాడని, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించడంతో తను తన తల్లిగారింటికి వెళ్లానని బాధితురాలు చెప్పింది. ఈ నెల 14న బహిర్భూమికి వెళ్లగా.. నోట్లో గుడ్డలు కుక్కి మరోసారి అత్యాచారం చేశాడని చెప్పింది. కేకలు వేయడంతో తన భర్త రావడంతో సదరు వ్యక్తి పారిపోయాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల అదృశ్యం

మూసాపేట, సెప్టెంబరు 26: మండలంలోని జానంపేట గ్రామానికి చెందిన యువతి బుధవారం మధ్యరాత్రి తర్వాత ఎవ్వరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గ్రామంతో పాటు ఇతర గ్రామాల్లోని బంధువులతో విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాస్ తెలిపారు.

- అడ్డాకుల మండలం పొన్నకల్‌కి చెందిన ఆంజనేయులు అతని భార్య మాధవి ఇద్దరూ గురువారం మూసాపేట మండలం కొమి రెడ్డిపల్లి గ్రామ శివారులో వ్యవసాయ పొలాల్లో గొర్రెలను మేపుతున్నారు. ఆ సమయంలో ఆంజ నేయులు గొర్రెలకు మందుల కొనుగోలుకు మహబూబ్‌న గర్‌కు వెళ్లాడు. కొంత సమయం తర్వాత మాధవి కనిపిం చడం లేదని స్థానికులు సమాచారం ఇచ్చారు. ఎంత వెతి కినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారించి కేసు నమోదు చేసినట్లు మూసాపేట ఎస్ఐ పి.శ్రీనివాస్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కల్వకుర్తిటౌన్, సెప్టెంబర్ 26 : మండలంలోని ఎల్లికల్ గ్రామంలో గురువారం అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఇసుక టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊర్కొండ మండలంలోని జకినాలపల్లికి చెందిన సురేష్ తన టిప్పర్‌లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుంగా.. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అంగన్‌వాడీలకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి

కొల్లాపూర్, సెప్టెంబరు 26: అంగన్‌వాడీలకు మూడు సంవత్సరాల బీఎల్‌వో పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం కొల్లాపూర్ ఆర్‌డీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూ డిన వినతిపత్రాన్ని కొల్లాపూర్ ఆర్‌డీవో నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీలకు మూడు సంవత్సరాల నుంచి బీఎల్ వో డ్యూటీ చేసిన డబ్బులు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి బీఎల్‌వోల డబ్బు లు రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంత్, అంగన్వాడీల జిల్లా నాయ కురాలు సుజాత, మాధవి, గోవిందమ్మ, ఖాజా భాను, అనురాధ, సుజాత, సుధా రాణి, శ్యామల, హేమలత, పార్వతి, దేవమ్మ, వరలక్ష్మి, చెన్నమ్మ, జిలేఖ, ఇందిరా, మంగమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశ అభ్యున్నతికి ప్రధాని కృషి

- బీజేపీ సభ్యత్వ నమోదులో ఎంపీ డీకే అరుణ



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మిడ్జిల్, సెప్టెంబరు 26 : దేశాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వి కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంతకు ముందు మండల కేంద్రంలోని కేజీబీవీని పరిశీలించి, కేజీబీవీ ఆవరణలోకి వస్తున్న వర్షపునీటిని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబి బాలకృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శులు రాజేశ్వర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్లమెంట్ పుల్‌టైమర్స్ బుడ్డన్న, నాయకులు పల్లె తిరుపతి, సాహితిరెడ్డి, ముచ్చర్ల కృష్ణయ్య, నర్సింములు, ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, రవిగౌడ్, రమేష్, నాగరాజు, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, నరేందర్, లక్ష్మారెడ్డి, కృష్ణాబాయి, సీతారంజావర్, బాలవర్ధన్‌గౌడ్, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింములు, పలు మండలాలకు చెందిన పార్టీ పదాధికారులు ఉన్నారు.

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఎంపీ

మహబూబ్ నగర్ (క్లాక్‌టవర్), సెప్టెంబరు 26 : పాలమూరు పట్టణంలో గురువారం ఎంపీ డీకే అరుణ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ఆలయ మర్యాదాల ప్రకారం సాదర స్వాగతం పలికారు. భారతీయ జనతాపార్టీ వ్యవస్థాపకులు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని ఆలయ పరిసరాలలో ఆమె మొక్కలు నాటి నీళ్లు పట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి పాండురంగారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల యాదయ్య, శక్తికేంద్రం ఇన్‌చార్జి దర్పల్లి హరికృష్ణ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ట్రస్మా నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 26 : తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎస్పీ డి.జానకిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్, గౌరవ న్యాయసలహాదారు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్దన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీకి ప్రైవేట్ పాఠశాలల సమస్యలు వివరించినట్లు నాయకులు తెలిపారు.

పలువురు ఎంఈవోల బాధ్యతల స్వీకరణ



కోయిలకొండ : ఎంఈవో వెంకట్‌జీని సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కోయిలకొండ/ దేవరకద్ర/ నవాబ్‌పేట, సెప్టెంబరు 26 : జిల్లాలోని పలు మండలాల ఎంఈవోలు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. కోయిలకొండ, దేవరకద్ర, నవాబ్‌పేట మండలాలకు నూతన ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించారు. కోయిలకొండ ఎంఈవోగా జడ్పీ ఉన్నత పాఠశాల సీనియర్ హెచ్‌ఎం వెంకట్‌జీ గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంపీడీవో కాళప్ప నుంచి బాధ్యతలు స్వీకరించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గోపాల్‌నాయక్‌లు సన్మానించారు. సీఆర్‌పీలు శంకర్, హర్షవర్ధన్, వెంకటేష్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ నాయక్, వెంకట్‌రెడ్డి, నాగేష్ పాల్గొన్నారు. దేవరకద్ర, ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన బాలరాంను గురువారం మండల కేంద్రంలోని ఎమార్సీలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి భాస్కర్, కార్యదర్శి అజయ్, కృష్ణ, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. నవాబ్‌పేట ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన నాగ్యానాయక్‌ను, మాజీ ఎంఈవో రాజునాయక్‌ను ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించారు. పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ గోపాల్ గౌడ్, మల్లికార్జునరాజు పాల్గొన్నారు.

శ్వేతారెడ్డికి ఘన నివాళి



జడ్చర్ల ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జడ్చర్ల, సెప్టెంబరు 26 : మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సతీమణి డాక్టర్ శ్వేతారెడ్డి జయంతి సందర్భంగా గురువారం బీఆర్ఎస్ నాయకులు పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. జడ్చర్ల పట్టణంలోని లక్ష్మారెడ్డి గృహం వద్ద శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. జడ్చర్ల హౌసింగ్‌బోర్డు కాలనీలోని వృద్ధాశ్రమం, పట్టణంలోని అనురాగిణి ఆశ్రమం, సత్యేశ్వర ఆశ్రమంలోని మానసిక దివ్యాంగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.లక్ష్మారెడ్డి కుమార్తె స్ఫూర్తి, జడ్చర్ల మునిసిపల్ ఇన్‌చార్జి ఛైర్‌పర్సన్ పాలాది సారిక, కౌన్సిలర్ ఉమాదేవి, బీఆర్ఎస్ నాయకులు కోడ్గల్ యాదయ్య, పిట్టల మురళి, రఘుపతిరెడ్డి, శ్రీకాంత్, ప్రదీప్, ఈటి శ్రీను, వీరేశ్, జయరాజ్, పార్వతమ్మ పాల్గొన్నారు.

త్వరలో జర్నలిస్టులకు కొత్త పాలసీ

- జడ్చర్ల నియోజకవర్గ యూనియన్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్



ఐజేయూ జడ్చర్ల నియోజకవర్గ కమిటీని అభినందిస్తున్న యూనియన్ నాయకులు

జడ్చర్ల, సెప్టెంబరు 26 : రాష్ట్రంలో త్వరలోనే జర్నలిస్ట్‌లకు కొత్తపాలసీ రానుందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళాభవనలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ 60యేళ్ల సుదీర్ఘ పోరాటం చేసిందన్నారు. త్వరలోనే ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఏజెయూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టులకు కొత్త పాలసీ ప్రకటించే అవకాశం ఉందన్నారు. పనిచేసే జర్నలిస్టుకే అక్రిడేషన్ ఇవ్వాలని, అక్రిడిటేషన్ పొందిన ప్రతీ జర్నలిస్టుకు ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచిత చికిత్స, ఇళ్ల స్థలాలు అందించేలా కసరత్తు జరుగుతోందన్నారు. అనంతరం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేందర్, ప్రధానకార్యదర్శిగా సందీప్‌కుమార్, కోశాధికారికాగా పాలాది రమేశ్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కరీమ్, రాజు, శ్రీను నాయక్, నజీబ్, రాఘవేందర్, సహాయ కార్యదర్శులుగా నిస్సార్, బస్వరాజు, నవీన్‌కుమార్, పరంజ్యోతి, మోయిన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రఘులను ఎన్నుకున్నారు. సభ్యులుగా అహ్మద్, కృష్ణ, వేణు, సత్తార్, శ్రీకాంత్, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జిల్లా అధ్యక్షుడు దండుదత్తేందర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు జెమిని శేఖర్, అహ్మద్, వెంకట్, శ్రీనివాససాగర్, జడ్చర్ల నియోజకవర్గంలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తి ప్రదాత

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- వీర వనిత ఐలమ్మకు ఘన నివాళి అర్పించిన నాయకులు



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎస్పీ జానకి



చాకలి ఐలమ్మకు పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, చిత్రంలో కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్/ పాలమూరు/ దేవరకద్ర/ రాజాపూర్/ గండీడ్/ మహమ్మదాబాద్/ జడ్చర్ల/ నవాబ్‌పేట, సెప్టెంబరు 26 : చాకలి ఐలమ్మ స్ఫూర్తి ప్రదాత అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో ఆమె విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తెగువను, పోరాట పటిమను ప్రపంచానికి చాకలి ఐలమ్మను స్మరించుకుందామన్నారు. వారు చూపిన బాటలో నడుస్తూ తెలంగాణ మహిళలను శక్తిమంతులుగా చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కతనిశ్చయంతో ఉందన్నారు. మహిళల గౌరవాన్ని పెంచేందుకు మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం చరిత్రాత్మకమైందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, మునిసిపల్ వైస్ ఛైర్మన్ షబ్బీర్‌అహ్మద్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ ఛైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డీసీసీ కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, భరత్, తిరుమల వెంకటేష్, ఖాజాపాషా, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, సి.జె.బెనహర్, ఆవేజ్, ఫయాజ్, నాగరాజు, కె.శివప్రసాద్, దుర్గేష్ పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో : సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అల్వాల్‌రెడ్డి, కె.రాము, చాన్‌పాషా, సత్యనారాయణరెడ్డి, మహేష్, నరహరి, హనుమంతు, రాములు, లింగం, పెంటయ్య, ఇందిరమ్మ పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో : మాజీ మునిసిపల్ ఛైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కేసీ నరసింహులు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. డీసీసీబీ వైస్ ఛైర్మన్ కోరమోని వెంకటయ్య, గంజి వెంకన్న, శివరాజు, రవికిషన్‌రెడ్డి, గణేష్, అనంతరెడ్డి, శ్రీనివాసులు, పి.గిరిధర్‌రెడ్డి, నవకాంత్ పాల్గొన్నారు.

● బీసీ సమాజ్ ఆధ్వర్యంలో : బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నాయకులు శివన్న, రాజు, సారంగి లక్ష్మీకాంత్, డి.కె నాయి, సవారి సత్యం, యాదేశ్, నాగరాజు, యాదయ్య, కేశవులు, చంద్రయ్య పాల్గొన్నారు.

పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ : ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ : చాకలి ఐలమ్మ పోరాట యోధురాలని ఆమె ఎంతో మందికి స్ఫూర్తినిచ్చారని ఎస్పీ జానకి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళ్ళర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆర్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు. ● దేవరకద్రలో ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని రజక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘం నాయకులు మైబు, నాగరాజు, మణికంఠ, బాలరాజు, మలేష్, మహిళలు పాల్గొన్నారు. ● రాజాపూర్‌లో అంబేద్కర్ విగ్రహం దగ్గర చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. రమేష్ రెడ్డి, కృష్ణయ్య, యాదయ్య, శ్రీనివాస్ నాయక్, శంకర్, శంకరయ్య శివకుమార్, సాయి, శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ● గండీడ్/ మహమ్మదాబాద్ మండలాల్లో మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా రజక సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ● జడ్చర్లలో అంబేడ్కర్ చౌరస్తాలో గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి వివిధ సంఘాల వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు. ● నవాబ్‌పేట మండలం యన్మనగండ్లలో రజక సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్, మాజీ ఎంపీటీసీ శేఖరయ్య, ఆర్టీసీ భీమయ్య, వేణుగోపాల్ తదితరులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. యాదయ్య, వెంకటేష్, చిన్న, రామస్వామి పాల్గొన్నారు.

వరద నివారణ చర్యలు తీసుకుంటాం

- రామయ్యబౌళిని పరిశీలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 26 : లోతట్టు ప్రాంతాలకు వరదనీటి సమస్య రాకుండా భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెద్దచెరువు అలుగు ద్వారా బీకెరెడ్డికాలనీ, రామయ్యబౌళి లోతట్టు ప్రాంతాలకు వరదనీరు చేరుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలలో వరదనీటిని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. మున్ముందు సమస్యలు లేకుండా చూస్తామని, ఇందుకోసం పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. వర్షాలు బాగా కురుస్తున్నందున ఎగువ నుంచి చెరువులకు భారీగా వరదనీరు వస్తుండటంతో చెరువులు అలుగు పారి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్య లేకుండా ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ఛైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ మనోహర్, నాయకులు సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, రాశీద్, ఖాజాపాషా, సుధాకర్‌రెడ్డి, ఫయాజ్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లుకూలిన బాధితులకు ఆర్థిక సాయం : ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయిన ఐదుగురికి ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్థిక సాయం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.16,500 సహాయాన్ని ఆయన అందజేశారు.

మహేంద్ర సంఘానికి అండగా ఉంటా : ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ టౌన్ : మహేంద్ర సంఘానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా మేదరి సంఘం (మహేంద్ర సభ్యులు) కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. మేదరి బంధు పథకం కింద ఆర్థిక సహాయం అందించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల రాములు, జోరిగ ఆంజనేయులు, కందూరు వెంకట్‌రాముడు పాల్గొన్నారు.

నేడు పర్యాటక దినోత్సవం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 26 : ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు నూతన కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి పర్యాటక శాఖ అధికారి యు. వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయితో పాటు, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన న్యూరిషి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మహబూబ్ నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 26 : జాతీయ స్థాయి క్రీడల్లో న్యూరిషి ఉన్నత పాఠశాల విద్యార్థి పి.రాజేశ్ జాతీయస్థాయి పోటీలు బిహార్ రాష్ట్రంలోని ఆర ప్రాంతంలో జరిగిన గోగేమ్ క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలలో సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ ప్రిన్సిపాల్ వి.వెంకటరమణ, పీఈటీ కె.విష్ణుకాంత్ గౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

వయోవృద్ధుల సమస్యలు పరిష్కరిస్తాం

దేవరకద్ర, సెప్టెంబరు 26 : గ్రామీణ ప్రాంతాల్లో వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నూతన కమిటీని ఏర్పాటు చేసిందని నాయబ్ తహసీల్దార్ దీపిక అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కమిటీలో భాగంగా కమిటీ ఛైర్మన్‌గా తహసీల్దార్, సభ్యులుగా ఎస్ఐ, ఎంపీడీవో, వైద్యాధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఐకేపీ తదితరులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

విద్యార్థుల లేఖపై విచారణ

- బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో విచారణ చేపట్టిన ఏంఈవో శ్రీనివాసులు

జడ్చర్ల, సెప్టెంబరు 26 : తమకు ఇవ్వాల్సిన గుడ్లు, ఇతర ఆహారపదార్థాలు సక్రమంగా అందడం లేదని పాఠశాల విద్యార్థులు కలెక్టర్‌కు లేఖ రాయగా, గురువారం విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఈ నెల 25న కలెక్టర్‌కు లేఖ రాశారు. 'కలెక్టర్ గారు.. మాకు మధ్యాహ్న భోజనం గుడ్లు పెడ్తలేరు. ఈ సంవత్సరంలో కేవలం ఐదారు సార్లు మాత్రమే గుడ్లు ఇచ్చారు. ఈ నెల 25న మాత్రమే పల్లీ పట్టీలు ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం ఇవ్వాలి. పాఠశాలలో ఉడక బెట్టిన గుడ్లు సారు వాళ్ల స్టాఫ్ రూంకు తీసుకెళ్లి, చిక్కీ ప్యాకెట్‌లు కూడా తింటారు' అని కలెక్టర్‌కు లేఖ రాశారు. విద్యార్థుల రాసిన లేఖపై విచారణ చేపట్టాలంటూ డీఈవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో గురువారం పాఠశాలలో ఏంఈవో శ్రీనివాసులు విచారణ చేపట్టారు. లేఖ రాసిన విద్యార్థులతో పాటు గుడ్లు ఇచ్చే ఏజెన్సీ నిర్వాహకులతో ఏంఈవో విచారణ చేపట్టారు. పూర్తి నివేదికలను డీఈవో, కలెక్టర్‌కు అందజేస్తానని ఏంఈవో తెలిపారు. అంతకు ముందు జడ్చర్ల మండలం గంగాపురం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులతో మాట్లాడారు.

ఎంఈవోగా సుధాకర్

రాజాపూర్, సెప్టెంబరు 26 : మండల విద్యాశాఖ అధికారిగా తిర్మలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంగా పని చేస్తున్న సుధాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో మచ్చేందర్ సమక్షంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు.

పాలమూరు పూర్తి కావొద్దని బీఆర్ఎస్సోళ్ల కుట్ర

- పనులను అడ్డుకుంటే తగిన బుద్ధిచెప్తాం

- బూట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, సెప్టెంబరు 26 : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఉదండాపూర్‌లో చేపట్టనున్న రిజర్వాయర్ పనులను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు యత్నిస్తున్నారని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఒక వేళ ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే తగిన బుద్ధి చెబుతామని ఎమ్మెల్యే అన్నారు. గురువారం మండలంలోని భైరంపల్లి, కంచనపల్లి, వస్పుల, లింబ్యా తండా, చిలువేరు, వెలుగొమ్ముల, కొత్తపల్లి గ్రామాలలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఎమ్మెల్యే బూట్లను అందజేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని తాను సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ద్వారా తొలివిడతగా నిర్వాసితులకు రూ. 45 కోట్లను విడుదల చేశారని గుర్తు చేశారు. ఉదండాపూర్ ప్రాజెక్టు పనులు పూర్తయితే కాంగ్రెస్ పార్టీకి, తనకు మంచి పేరు వస్తుందని భావించిన బీఆర్ఎస్ నాయకులు పనులు పూర్తికావొద్దని కుట్రలు పన్నుతు, రైతులను ఉసిగొల్పుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే లక్షమందితో ఉదండాపూర్‌కు వచ్చి పనులను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే వివరించారు. ఉదాండపూర్ ప్రాజెక్టు పనులు పూర్తయితేనే నియోజకవర్గంలోని బాలానగర్, రాజాపూర్, నవాబుపేట మండలాలతో పాటు రంగారెడ్డి జిల్లా లక్ష్మీదేవిపల్లి వరకూ ఉన్న మండలాలకు తాగు, సాగు నీరందుతుందన్నారు.

● సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ : మండలంలోని వస్పుల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 1993-94వ సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యేను సన్మానించారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి, ఎంఈవో సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు రబ్బాని, నాయకులు వెంకటయ్య, కృష్ణారెడ్డి, సాయులు, గౌస్, నర్సింహ్మా, రాజారెడ్డి, రమేష్, పాండు, విజయ్, మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

ప్రతీ ఒక్కరికి ఆరోగ్య పరిజ్ఞానం ఎంతో అవసరం

- ఎస్వీఎస్ విద్యాసంస్థల ఎండీ డాక్టర్ కె.జె. రెడ్డి

- ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన



విజ్ఞాన ప్రదర్శన ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కె.జె రెడ్డి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), సెప్టెంబరు 26 : సమాజంలో ప్రతీ ఒక్కరికి ఆరోగ్య పరిజ్ఞానం ఎంతో అవసరమని ఎస్వీఎస్ విద్యాసంస్థల ఛైర్మన్, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ కె.జె.రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్వీఎస్ వైద్యకళాశాల, ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య విద్య వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని అప్పుడే మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉంటాడని అన్నారు. ఈ సదస్సులో అన్ని విభాగాలకు సంబంధించిన 2,500 రకాల ప్రదర్శనలు ఉంచామన్నారు. 1998లో ఎస్వీఎస్ విద్యాసంస్థలను స్థాపించి నేడు దేశంలోనే ఒక గొప్ప కళాశాల, ఆసుపత్రిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించామని, ఉస్మానియా తరహాలో దీన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. సేవాదృక్పథంతో ఆసుపత్రిలో సేవలందిస్తామని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా. జోషి. సిబ్బంది, ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు. ఎస్వీఎస్ మెడిఎక్స్‌పో-2024 గురువారం నాటికి 8వ రోజుకు చేరగా, మొత్తం 68వేల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శనను తిలకించారు. ఉచితంగా బస్సులు కూడా పంపించి విద్యార్థులకు ఈ సదస్సులో పాల్గొనే అవకాశం కల్పించారు.

మాకొద్దు ఏకీకృత పెన్షన్

- సీపీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 26 : 'మా కొద్దు ఏకీకృత పెన్షన్.. మాకు కావాల్సింది పాత పెన్షన్ విధానం' అని సీపీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం పిలుపు మేరకు గురువారం సీపీఎస్ యూనియన్ జిల్లా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి పెన్షన్ ఆక్రోశ్ మార్చ్ పేరిట నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సీపీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి, ప్రధాన కార్యదర్శి కేఎం. చంద్రకాంత్, కోశాధికారి రాఘవేంద్ర, నాయకులు వెంకటయ్యగౌడ్, గోవర్ధనచారి, గోవర్ధన్, కృష్ణ పాల్గొన్నారు.

● గండీడ్ : పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, టీఎస్ పీఎస్‌సీపీఎస్‌ఈయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ పిలుపు మేరకు గురువారం పెన్షన్ అక్రోస్ మార్చ్‌లో భాగంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ నాగలక్ష్మికి వినతి పత్రం అందించారు.

కోయిల్‌సాగర్‌కు పెరిగిన వరద

దేవరకద్ర, సెప్టెంబరు 26 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగింది. శుక్రవారం ప్రాజెక్టు 5 షట్టర్లను ఫీటు ఎత్తుకు తెరిచి 3500 క్యూసెకుల నీటిని దిగువకు విడుదల చేశారు. నాలుగు రోజుల క్రితం నీటిమట్టం 31.6 అడుగులు ఉండగా బుధవారం కురిసిన వర్షానికి ప్రాజెక్టు నీటిమట్టం 32.5 అడుగులకు చేరింది. అంకిళ్ల, కోయిల్‌కొండ పెద్దవాగుల నుంచి నీటి ఉధృతి పెరిగిందని. సందర్శకుల తాకిడి పెరిగింది.

జడ్పీ సీఈవో సమీక్ష

జడ్చర్ల, సెప్టెంబరు 26 : జడ్చర్ల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల అధికారులతో మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మండలంలో శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులు, జరిగిన పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జడ్చర్ల మండలం లింగంపేట, కోడ్గల్ గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, శ్రమదానం, స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను పరిశీలించారు.

తల్లిదండ్రులను పట్టించుకోకుంటే చర్యలు

గండీడ్, సెప్టెంబరు 26 : తల్లిదండ్రులను పట్టించుకోకుంటే చర్యలు తప్పవని ఎంపీవో నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో మండల కమిటీ సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను, సీనియర్ సిటిజన్‌లను పట్టించుకోకుంటే ఆక్ట్ 2007 ప్రకారం వారి కొడుకులు, వారికి సంబంధించిన వారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. మండల కమిటీ ఛైర్మన్‌గా తహసీల్దార్, మెంబర్లుగా ఎంపీడీవో, మెడికల్ అధికారి, ఏపీఎం, ఎస్ఐ, సీడీపీవో సూపర్‌వైజర్, సీనియర్ సీటిజన్/ ఎన్‌జీవోలు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎన్‌ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

జడ్చర్ల, సెప్టెంబరు 26 : మండలంలోని కుర్వగడ్డపల్లి గ్రామ సమీపంలోని మీనాంబరం వాగు పరివాహకంలోని శ్రీ పరసవేదీశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్లు పరిశుభ్రం చేశారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలోని ఎన్‌ఎస్ఎస్ యూనిట్-3 వాలంటీర్లు పరిసరాలను పరిశుభ్ర పరచి, సుమారు 50కిలోల చెత్తను సేకరించారు. అలాగే గంగాపురం సమీపంలోని గొల్లత్తగుడి, శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం ప్రాంగణంలో పారిశుద్యం కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుకన్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నర్మద, అధ్యాపకులు సదాశివయ్య, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా సంతోష్

నవాబ్‌పేట, సెప్టెంబరు 26 : లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా సంతోష్ నాయక్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర కార్యదర్శి చందర్ నాయక్, గౌరవ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ తెలిపారు. అధ్యక్షుడిగా సంతోష్ నాయక్, గౌరవాధ్యక్షుడిగా చందునాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా అంబదాస్ నాయక్, ఉపాధ్యక్షులుగా రామ్‌చందర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా మంగ్యానాయక్, కార్యదర్శులుగా గోవిందు నాయక్, వినోద్‌నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

చట్టాలపై వృద్ధులు అవగాహన కలిగి ఉండాలి

జడ్చర్ల, సెప్టెంబరు 26 : చట్టాలపై వయోవృద్ధులు అవగాహన కలిగి ఉండాలని జడ్చర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి పద్మాంజలి సూచించా రు. జడ్చర్ల హౌజింగ్‌బోర్డు కాలనీలోని వృద్ధాశ్రమంలో గురువారం వయోవృద్ధులకు వినోద కార్యక్రమాలు నిర్వహించారు. క్యారమ్, చెస్, మ్యూజికల్ చైర్ వంటి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు సంజీవ్‌కుమార్, అధికారులు బాలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

భాషా పండితుల విజయం పుస్కకావిష్కరణ

జడ్చర్ల, సెప్టెంబరు 26 : జడ్చర్ల పట్టణంలోని బాలికల జడ్పీహెచ్ఎస్‌లో గురువారం భాషా పండితుల విజయం పుస్తకాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్ పాలొన్నారు. భాషా పండితులు 20యేళ్లుగా చేసిన పోరాట ఫలితంగానే పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయని, భాషా పండితులకు పదోన్నతులు దక్కాయన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీరాములు, రమణాచార్యులు, ఎల్లయ్య, జంగయ్య, కృష్ణ, రజని, కృష్ణవేణి, మంజులాదేవి, శ్రీదేవి, తిరుపతమ్మ, సునీత, అరుణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కోయిలకొండ, సెప్టెంబరు 26 : న్యాయసేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కేసులు నమోదైన ఇరువురు రాజీ పడినట్లయితే వారు లోక్‌అదాలత్ సేవల ద్వారా కేసును పరిష్కరించవచ్చునని వెల్లడించారు.